డిగ్రీ రెగ్యులర్, వన్‌టైం పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల రెగ్యులర్, వన్‌టైం చాన్స్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్సీ తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్, వన్‌టైం చాన్స్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

ఎంబీఏ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే ఎంబీఏ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ అన్ని సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్, ఎంబీఏ (ఇయర్ వైస్ స్కీమ్) మొదటి, రెండు, మూడో సంవత్సరం బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఓయూ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్స్ ఫర్ వుమెన్ పోటీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్స్ ఫర్ వుమెన్ పోటీలను ఖరారు చేసినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐసీటీ (వుమెన్) కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రుకా కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన సికింద్రాబాద్‌లోని జీహెచ్ ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఈ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. పోటీలు నిర్వహించబోయే తేదీలు, నిర్వహించే కళాశాల, వేదికలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదీలోగా సంబంధిత రుసుము చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, సెప్టెంబర్ 19: పట్టాలు దాటుతుండగా ఎలహంక రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య కథనం ప్రకారం.. గుర్తు తెలియని ఓ యువకుడు (35)గురువారం ఫలక్‌నుమా–బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా.. అదే సమయంలో వచ్చిన ఎలహంక రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు చొక్కా, తెలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.2 అడుగులు ఉన్నాడని తెలిపారు. మృతుడి వివరాల కోసం 9948695948 లో సంప్రదించాలని కోరారు.

కోట్లాది రూపాయలు వెచ్చించి డివిజన్ అభివృద్ధి

● వార్డు కార్యాలయ నిర్మాణ పనులు పరిశీలించిన కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, సెప్టెంబర్19: సీతాఫల్‌మండి వార్డు కార్యాలయ నిర్మాణ పనులను కార్పొరేటర్ హేమ గురువారం పరిశీలించారు. పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నామాలగుండు వార్డు కార్యాలయాన్ని కోటి తొంబై లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే భవన నిర్మాణం పూర్తి అవుతుందని అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని తెలిపారు. బీదల బస్తీ, మైలార్‌గడ్డ ఏక్ నంబర్ లైన్‌లో పర్యటిస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నూతన సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరగా వెంటనే ప్రతిపాదించాలని అధికారులను ఆదేశించారు. మరి కొన్ని చోట్ల ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. వచ్చే అమ్మవారి నవరాత్రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ పనులన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన

బీదలబస్తీలో పర్యటిస్తూ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సామల హేమ

వని, గత ప్రభుత్వ హయంలోనే ప్రతిపాదనలు పంపించామని మంజూరు అయి ఇప్పుడు పనులు మొదలు పెడుతున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. ఏక్ నంబర్ లైన్‌లో సీసీ రోడ్ నిర్మాణ పనుల వ్యయం రూ.14 లక్షల, ఎస్ ఆర్ హాస్పిటల్ బ్యాక్ సైడ్ లైన్ లోరూ 30 లక్షల, బీదలబస్తీ రూ. 25 లక్షలు, శ్రీనివాస్ నగర్ ఆయిమాత ఆలయం దగ్గర రూ. 31.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు , చిలకలగూడ భవానినగర్, ఎరుకలబస్తీలో శాబాద్ ఫ్లోరింగ్ పనులకు రూ. 7.30 లక్షలు, చిలకలగూడ బాటా షోరూమ్ వద్ద పైప్ లైన్ పనులకు రూ.17 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆయి మాతా ఆలయం పనుల నిధులు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద మంజూరయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, నాయకులు లక్ష్మి, చందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

● నివాళి

మోండా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అశోక్ బుధవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం టకారా బస్తీలోని వారి నివాసానికి వెళ్లి అశోక్ పార్థివ దేహంపై పూలమాల ఉంచి ని వాళులర్పించారు. అనంతరం అశోక్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లి కార్జున్‌గౌడ్, మోండా డివిజన్ బీఆర్ ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు రాములు, కిశోర్, మహేశ్ యాదవ్, చందు ఉన్నారు.

– మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 19

ఆర్టీసీ బస్సు కింద పడి విద్యార్థినికి తీవ్రగాయాలు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 19: ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ విద్యార్థిని కాలు విరగడంతోపాటు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పరిధిలో ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ కథనం ప్రకారం..ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన చెన్న కీర్తన మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నది. రోజూ కళాశాలకు ఆర్టీసీ బస్సులో వెళ్లి, వస్తుంది. బుధవారం సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత మైసమ్మగూడలోని కళాశాల సమీపంలో ఈసీఐఎల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. రద్దీ ఎక్కువగా ఉండటంతో బస్సులోని కండక్టర్ సీటు వద్ద నిలబడింది. బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బస్సులో ఉన్న విద్యార్థిని ఒక్కసారిగా బస్సు ముందు టైర్ల కింద పడింది. దీంతో కాలు పైనుంచి బస్సు పోవడంతో కాలు విరిగిపోయింది. స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. గురువారం బాధితురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్తీక మాసంలో ఆది హిందూ సమ్మేళనం

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 19: రానున్న కార్తీక మాసంలో ద్రవిడ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఆది హిందూ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు పరిషత్ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి స్వదేశీ ద్రవిడులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. తార్నాకలోని ఆయన స్వగృహంలో వినోద్‌కుమార్ జన్మదినాన్ని ఓయూ పరిశోధక విద్యార్థులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది హిందూ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ.. విదేశీ ఆర్య సంతతికి చెందిన పార్టీలు 78 ఏండ్లుగా స్వదేశీ ద్రవిడులను పరిపాలిస్తున్నారని ఆరోపించారు. వారి నుంచి అధికారాన్ని సాధించడమే ద్రావిడ ధార్మిక పరిషత్ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఆది హిందూ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గాలి వినోద్‌కుమార్, వివిధ సంఘాల ప్రతినిధులు

ప్రజల్లో శుభ్రతపై అవగాహన కల్పించాలి

మాణికేశ్వరీనగర్‌లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 19: ప్రజలందరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి అన్నారు. దీనికోసం ప్రజల్లో శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తార్నాక డివిజన్ మాణికేశ్వరీనగర్‌లో ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా'కార్యక్రమాన్ని గురువారం ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ హాజరై మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా ఉద్యమం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్రను గుర్తు చేస్తుందని చెప్పారు. ఈ ఉద్యమం సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, ఇఫ్లూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేత

లయన్స్ క్లబ్ ఆఫ్ వెస్ట్ మారేడుపల్లి ఆధ్వర్యంలో మెట్టుగూడ దూద్‌బావి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు (300 మంది) గురువారం కిట్స్, బ్యాగ్స్, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి.. పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేయూతనందించడానికి ముందుకు వచ్చిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– అడ్డగుట్ట, సెప్టెంబర్ 19

ఆకట్టుకుంటున్న హస్తకళల ఉత్పత్తులు

ఎగ్జి బిషన్‌లో వస్తువులు తీసుకుంటున్న మహిళలు.

సికింద్రాబాద్, సెప్టెంబర్ 19 : సికింద్రాబాద్ కౌతా కంచి కామకోటి కల్యాణ నిలయంలో నిర్వహిస్తున్న స్వదేశీ హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శన ఎంతో ఆకుట్టుకుంటుంది. అన్ని వయస్సుల వారి అభిరుచులకు అనుగుణంగా ఆధునిక ప్యాషన్ డిజైన్స్ జమ్ముకాశ్మీర్ ఎంబ్రాయిడరీ సారీస్, ధర్మవరం, వెంకటగిరి, గద్వాల్,పోచంపల్లి, కలంకారీ, ఉప్పాడ, అస్సాం, బిహార్, ప్రింటెడ్, అస్సాం, కర్నాటక, రాజస్తాన్, మధ్యప్రదేశ్, తదితర రాష్ట్రాలకు చెందిన పట్టుచీరలు సరసమైన ధరలకు లభిస్తున్నాయి. డ్రెస్ మెటీరిల్స్ ఈప్రదర్శలో అందుబాటులో ఉంచారు. ఇవే కాకుండా హరియాన బెడ్ కవర్స్, కుషన్ కవర్స్, కుర్తీస్ పెయింటింగ్, హ్యాండీ క్రాఫ్ట్స్ లాంటి ఎన్నో మంచి డిస్కౌంట్‌లో ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కలర్ ఫుల్ ఎగ్జిబిషన్‌ను ఉదయం 11 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని అన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

మిలాద్–ఉన్– నబీ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకుడు రవిప్రసాద్‌గౌడ్, ముస్లింలు

సికింద్రాబాద్/అడ్డగుట్ట, సెప్టెంబర్19: మిలాద్ ఉన్ నబీని సికింద్రాబాద్‌లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన రోడ్లపై జూస్‌లు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలద్ ఉన్ నబీ లో భాగంగా ముస్లింలు సికింద్రాబాద్‌లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ హాజరయ్యారు. ముందుగా ప్రజలందరికీ మిలాద్–ఉన్– నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ అమిద్, ఎండీ రఫీక్, కరీం, నజీర్, సాకీర్, సల్మాన్, గౌస్, ఇర్ఫాన్ బృందం,అజయ్ నాయుడు, టీవీ కుమార్, సురేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకొని అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో ముస్లింలు ర్యాలీని నిర్వహించారు. అంతకు ముందు మసీద్‌ల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం అడ్డగుట్ట మసీద్ నుంచి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖలీల్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలి

ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదాజయలక్ష్మీదేవి

తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డిని సన్మానిస్తున్న పీపీఏఐ అధ్యక్షుడు శరత్‌బాబు, వీసీ డాక్టర్ శారదాజయలక్ష్మీదేవి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 19 : దేశంలో వ్యవసాయ అనుబంధ రంగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ (ఎఎన్‌జీఆర్ఎయు) వైస్ చాన్సలర్ డాక్టర్ శారదాజయలక్ష్మీదేవి అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా(పీపీఏఐ) అధ్యక్షుడు డాక్టర్ శరత్‌బాబు ఆధ్వర్యంలో జరిగే రెండు రోజుల సదస్సుకు గురువారం మొదటిరోజు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కువ ఉపాధి అవకాశాలున్నాయన్నారు. దేశానికి అన్నం పెట్టే రంగాన్ని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వ్యవసాయ రంగంలో పురుగుమందులు, జీవ రసాయనాల వాడకంపై సుధీర్ఘ చర్చ జరిగింది. పీజేటీఎస్ఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై వీడియో, ఆడియో మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. లేబర్ కొరతను గుర్తించి డ్రోన్‌లతో పురుగు మందుల పిచికారీ చేయడం వల్ల యువతకు సైతం ఉపాధి లభిస్తుందని తెలిపారు.

వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తలు, రైతులను ప్రోత్సహించడం వల్ల తెలంగాణలో అనతి కాలంలోనే అనూహ్య మార్పు చూశామని అన్నారు. చైనా, నెదర్లాండ్ టెక్నాలజీకి తీసి పోని విధంగా మన దేశంలోనూ పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు. పరిశోధనలతోపాటు రైతులను ఎప్పటికప్పుడూ చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని అప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కాగా ఎక్కువ దిగుబడి సాధించాలనే ఉద్దేశంతో దేశంలో పురుగు మందుల వాడకం పెరిగిందని దీంతో భూగర్భజలాలతో పాటు పర్యావరణం కలుషిత మౌతుందని అభిప్రాయ పడ్డారు. పురుగు మందుల వాడకం మానవ మనుగడకు ప్రమాదరకంగా పరిణమిస్తుందని దీనిని నివారించాల్సిన అవసరం మనందరిపై ఉందని అన్నారు. పంటల సాగులో రైతులకు సీంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించి, సేంద్రియ ఎరువులు వాడేలా ప్రోత్సహించాలని తెలిపారు. పురుగు మందుల వాడకం వల్ల భూసారం తెబ్బతింటుందని అన్నారు. ఈ సందర్భంగా సేంద్రియ ఎరువులు, బయోకెమికల్స్, ఫార్మింగ్, విత్తన పరిశోధన, పరిశీలన, పంట మార్కెట్ విధానం తదితర అంశాలపై సీనియర్ శాస్త్రవేత్తలు ఏఎన్‌జీఆర్ఏయూ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాస్‌రావు, ఏఐ సీఆర్‌పీ వీడ్స్, పీజేటీఎస్ఏయూ ప్రిన్సిపాల్ సైంటిస్టు హెడ్ డాక్టర్ టి.రామ్‌ప్రకాశ్, డాక్టర్ టీవీకే సింగ్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ ప్రదీప్ కులకర్ని, ఆగ్రోకెమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ డా.కళ్యాణ్‌బిగోస్వామి, ఐపీ ఇండస్ట్రీస్ హెడ్ డాక్టర్ కేఎస్ త్యాగరాజన్, దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొని చర్చించారు.

డీఎస్ఎంకాలనీలో కలుషిత నీటికి చెక్

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీజీఎం వంశీకృష్ణ

అమీర్‌పేట్, సెప్టెంబర్ 19 : సనత్‌నగర్ డీఎస్ఎం కాలనీలో కలుషిత నీటి సరఫరాకు కారణాలను అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన ఫిర్యాదులు అందుకున్న జలమండలి డీజీఎం వంశీకృష్ణ కారణాలను పరిశీలించేందుకు మంచినీటి పైపులైన్ల తవ్వకాలు చేపట్టారు. గురువారం ఉదయం జరిగిన మంచి నీటి సరఫరా సమయంలో డీజీఎం డీఎస్ఎంకాలనీ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇక్కడ అమర్చిన పొజిషన్ కెమెరా ద్వారా కలుషిత నీటి సరఫరా జరుగుతున్న 15 ఇండ్లకు సంబంధించిన పైపులైన్లలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో మంచి నీటి పైపులైనులో డ్రైనేజీ నీరు కలుస్తున్నట్టు గుర్తించారు. దీని ఫలితంగానే కలుషిత నీటి సమస్య తలెత్తిందని, గుర్తించిన వెంటనే మరమ్మతులు చేశామని డీజీఎం తెలిపారు. దీంతో మంచి నీటి సమస్య పరిష్కారమైందని తెలిపారు.

పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలి

పీఎఫ్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికులు

కాచిగూడ, సెప్టెంబర్ 19: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.1,000 నుంచి రూ.5 వేల వరకు పెంచాలని భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి విజ్ఞప్తి చేశారు. భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం బర్కత్‌పురలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాంరెడ్డి, ఎస్.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. కార్మికుల కుటుంబాల పొట్టకొడుతూ, హక్కులను కాలరాస్తుందని వారు ధ్వజమెత్తారు. కార్మికుల మనోభావాలను గ్రహించి పెన్షన్‌ను రూ.5వేల వరకు పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు హెల్త్‌కార్డులు, రైలు, బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం కార్మికుల డిమాండ్లను బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయంలో కమిషనర్‌కు భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రతినిధులు భూమయ్య, వెంకటేశం, దినకర్ రావు, మురళి, శ్రీహరి, ఏజీ రెడ్డి, విశ్వనాథం, వీరయ్యతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

కళలు, కళాకారులను పరిరక్షించుకోవాలి

49వ అఖిల భారత సంగీత, నృత్య పోటీలను ప్రారంభించిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 19: నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో సంగీత నాటక అకాడమీ సౌజన్యంతో 49వ అఖిల భారత సంగీత, నృత్య పోటీలు నాంపల్లిలో గల పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ అలాశెట్టి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఎన్ఎన్ఎస్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్‌పర్సన్ యు.వి.ఎల్ ఆనంద అధ్యక్షతన జరగిన ఈ సభలో ట్రెజరరీ డిప్యూటీ డైరక్టర్ జి. వసుంధర, భారత్ బయోటెక్ చీఫ్ సైనాన్షియల్ ఆఫీసర్ టి. శ్రీనివాస్, రూట్స్ కొల్జీజియమ్ చైర్మన్ పి.భిక్షపతి, నృత్య గురువు వి.ఆనందమోహన్ పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారులతో పాటు మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, బీహార్‌కు చెందిన 384 మంది కళాకారులు హాజరైనట్లు నిర్వాహకుడు విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో నృత్య కళల పోటీలు, సుల్తాన్‌బజార్ శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆడిటోరియంలో సంగీత పోటీలు కొనసాగుతాయని, తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో 26న ముగింపు సభలో గురువులు, కళాకారులకు బహుమతులు అంద జేస్తామని అన్నారు.

IN THE COURT OF HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT: HUZURABAD
O.S.No. 374 of 2023
Between:-
Katanguri Ramakrishna Reddy and another ...Plaintiff
And
Katanguri Buchi babu and others ...Defendants
To,
Katanguri Buchi babu, S/o. Prabhakar Reddy, 12-10/3, 1st floor, Flat No.205. Mahthab Arcade, Tarnaka, Hyderabad-500007

Whereas the above named plaintiffs has instituted a suit against you. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit, or He shall be accompanied by some Person ,able to answers all such question, on the 30-09-2024 at 10-30 hrs,to answer the claim, and you are here by directed to produce in that day all the documents upon which you intend to rely in support of your defense.

Take notice that,in default of your appearance of the day before mentioned, the suit will be heard and determined in your absence.

Given as per the orders in I.A No.990 of 2024 in o.s.No.374 of 2023 this summons had been issued to the Defendant No.1

By order of the Hon'ble Court
Sd/- **Kankanala Amarender Reddy,** Advocate
Huzurabad, Cell: 94417 00956.